మరో రెండునెలల్లో..



వినుకొండ మండలంలోని వెంకుపాలెం సమీపంలోని జరుగుతున్న నగరవనం పనులను సబ్ డీఎఫ్‌వో విజయ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని, వినుకొండ ప్రజలకు నగర వనం పార్కు ఏప్రిల్ నెలలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆమె వెంట ఎఫ్‌ఆర్‌వో సయ్యద్ హుస్సేన్, ఎఫ్‌బీవోలు సురేంద్ర, నాగార్జున తదితరులు ఉన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

కుష్ఠు వ్యాధిపై అవగాహన



మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 13 వరకు కుష్ఠు వ్యాధిపై స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి చట్టు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ వ్యాధి మైక్రో బ్యాక్టీరియా సూక్ష్మ క్రిమి ద్వారా వ్యాప్తి చెందుతున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు పాల్గొన్నారు.

–శావల్యాపురం

కల్వర్టు భయపెడుతోంది!



గణపవరం నుంచి కావూరు లింగంగుంట్ల వెళ్లే డొంక రోడ్డు నవంబర్‌లో కురిసిన మిచాంగ్ తుఫాను ప్రభావంతో కల్వర్టు కొంతభాగం కూలి ప్రమాదభరితంగా మారింది. ఈ రోడ్డులో ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు ప్రయాణించాలంటే ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా కూలిన ప్రదేశంలో సిమెంటు పైపును ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేయించాలని రైతాంగం, ప్రయాణికులు కోరుతున్నారు.

–నాదెండ్ల

రూ.50 లక్షలతో ...



బాపనయ్యనగర్ సబ్‌స్టేషన్‌లో రూ.50 లక్షలు విలువైన ఐదు ఎంవీఎల పీటీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. గత శనివారం సబ్‌స్టేషన్‌లో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు సోమవారం నుంచి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

– నరసరావుపేట

క్లుప్తంగా

స్త్రీనిధి రుణాలతో ఎంతో మేలు



శావల్యాపురం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదలకు స్త్రీనిధి రుణాలు ఎంతో దోహద పడతాయని జిల్లా స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీనిధి రుణాలు పురోగతి లక్ష్యాలపై గ్రామసమాఖ్య సభ్యులు వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీయం మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి రుణాలు 28 వేల 400 మహిళా సభ్యులకు రూ. 142 కోట్లు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు 12 వేల 540 మంది స్వయ సహాయక మహిళా సభ్యులకు రూ.74 కోట్లు రుణాలను పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ముఖ్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో మహిళలు అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. మహిళ సభ్యుల జీవన ప్రమాణాలు పెంపుదలకు ప్రభుత్వం ఆర్థిక ప్రగతి పెరగడానికి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టిందన్నారు. స్త్రీనిధి రుణ పరిమితి గతంలో కంటే ప్రస్తుతం రూ. 5 లక్షల వరకు పెంపుదల చేశామన్నారు. గ్రామ సంఘాలు నిరంతరం గ్రూపుల్లోని సభ్యులను పర్యవేక్షణ చేయటంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హత కల్గిన ఉన్న ప్రతి సభ్యురాలకు పథకాలు వర్తించేలా క్షేత్రస్థాయిలో వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. శావల్యాపురం మండలంలో 800 మంది మహిళా సభ్యులకు రూ. 5 కోట్లు స్త్రీనిధి రుణాలను అందజేశామన్నారు. లక్ష్యాలను అధిగమించడానికి కృషి చేసిన వారందరినీ ప్రత్యేకంగా ఏజీయం అభినందనలు తెలిపారు. స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడంతో పాటు చెల్లింపులు కూడా అవకతవకలకు తావులేకుండా ఉండేలా పేటీయం మిషన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్త్రీనిధి రుణాలు వచ్చే రెండు నెలల్లో నూరు శాతం అయ్యేలా ప్రతి ఒక్కరు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ సదస్సులో ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, ఖాజావలీ, బేబిరాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరం సబ్‌స్టేషన్ 33–11 కేవీ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. రాజీవ్‌గాంధీకాలనీ, మేఘన ఆయిల్‌మిల్లు, విజయసారధి మిల్లు, రూరల్ ఫౌండ్రీ ఇండస్ట్రీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వివరించారు.

పేద మహిళలకు దుస్తులు పంపిణీ

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపేదలైన మహిళలకు నూతన వస్త్రాలు వితరణ చేసినట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి చట్టు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 మంది అనాథలైన మహిళలకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు విలువ చేసే దుస్తులు అందజేశారన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం నేత పోట్లూరి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పురపాలకసంఘం పరిధిలోని ఎన్ఎస్పీ కాలువ పై పాత వంతెన తొలగించి నూతన వంతెన నిర్మాణం కోసం రూ.35 లక్షలతో అంచనాలతో టెండర్లు పిలవడం జరిగిందని కమిషనర్ వివారెడ్డి తెలిపారు. అయితే టెండరు ప్రక్రియ పూర్తయిన తరువాత కౌన్సిల్ ఆమోదం పొందిన తరువాతనే పనిని ప్రారంభించాల్సి ఉందని కాంట్రాక్టు పని ఎవరికీ అప్పగించలేదని తెలిపారు. అయితే పట్టణానికి చెందిన కాంట్రాక్టరు గంధం సుబ్బారావు టెండరు దశలో ఉండగా త్వరలోనే వంతెన నిర్మాణం ప్రారంభం అవుతుందని వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి గందరగోళం చేస్తుండటంతో అతనిపై చర్యలు తీసుకునేందుకు వినుకొండ టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తదుపరి టెండరు వివరాలు తెలియజేస్తామని చెప్పారు. ఇలాంటి తప్పుప్రచారాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాదెండ్ల వాసులకు జనరిక్ ఔషధాలు

నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అంచెలంచెలుగా ఎదుగుతోంది. రైతులకు రుణాలు ఇవ్వడమే కాదు, వాటిని తిరిగి వసూలు చేసి అందరికీ ఆదర్శమై నిలిచింది. అంతే కాదు ఇప్పుడు ఇంకొక అడుగు ముందుకు వేసి జనరిక్ ఔషధ విక్రయ రంగంలోనూ అడుగిడనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సంఘం రథసారథులు దేశ రాజధానికి వెళ్లి శిక్షణ కూడా పొందారు. సహకార సంఘం ఆర్థికాభివృద్ధికి కల్యాణ మండపం, సూపర్ మార్కెట్ల స్థాపనకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం విశేషం.

- చౌక ధరలకే మందులు విక్రయించనున్న పీఏసీఎస్
- ఢిల్లీ సహకార్‌సే సమృద్ధిలో చైర్మన్, సీఈవో శిక్షణ
- అభివృద్ధిపథంలో వ్యవసాయ పరపతి సంఘం
- రెండు గ్రామాల్లో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం



నాదెండ్ల పీఏసీఎస్

నాదెండ్ల: నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధి పథంలో మరో మైలు రాయిని దాటుతోంది. గడిచిన ఐదేళ్ళ కాలంలో రైతులకు రుణాల మంజూరు, రికవరీలో ముందంజలో ఉంది. జిల్లాలోనే అగ్రగామి పరపతి సంఘంగా పేరొందింది. గతేడాది కాలంలో సుమారు రూ.45 కోట్లు రైతులకు వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు, డ్వాక్రా రుణాల మంజూరు చేశారు. ఎరువులు, విత్తనాలను సబ్సిడీ ధరల్లో రైతులకు అందుబాటులో ఉంచారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సహకార్‌సే సమృద్ధి కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు కురుకుంట్ల వెంకటరెడ్డి, సీఈవో అంజయ్య హాజరయ్యారు.

జనరిక్ ఔషధ విక్రయ కేంద్రం మంజూరు

ఈ సహకార సంఘం ద్వారా జనరిక్ ఔషధ కేంద్రం మంజూరైంది. త్వరలో ప్రారంభమై ప్రజలకు చౌక ధరలకే మందులు విక్రయించనున్నారు. ఈ కేంద్రం ద్వారా మందులు తయారు చేసిన కంపెనీకి సంబంధించి పేటెంట్ హక్కుల కాలం ముగిసిన తర్వాత అదే ఫార్ములాతో ఇతర కంపెనీలు తయారు చేసే జనరిక్ మందులు 50–80 శాతం తక్కువ ధరకే సహకార కేంద్రంలోని జనరిక్ మెడికల్ షాపులో లభ్యమౌతాయి. మందుల కొనుగోలుకు ప్రజలు ఎక్కువ ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో ప్రజలకు మేలైన చౌకధరలకే మందులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సహకార సంఘం ద్వారా కల్యాణ మండపంతో పాటూ సూపర్ మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి లభించింది. నిర్మించిన భవనంలో క్రింది భాగంలో సూపర్ మార్కెట్, పై భాగంలో కల్యాణ మండపం, ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ సొసైటీ ద్వారా రెండు గ్రామాల్లో మల్టీపర్పస్ గోడౌనులు నిర్మించనున్నారు. సాతులూరులో వెయ్యి మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో గోడౌను నిర్మాణానికి రూ.75 లక్షలు, గొరిజవోలు గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థం గోడౌన్‌కు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే సాతులూరు గోడౌన్ నిర్మాణం పూర్తికాగా, త్వరలో గొరిజవోలు గోడౌను నిర్మాణం పూర్తి కానుంది.

రుణాల మంజూరు, రికవరీల్లో ముందంజ



రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు, రికవరీల్లో సొసైటీ ముందంజలో ఉంది. ఇటీవల ఈ సొసైటీకి జనరిక్ ఔషధ కేంద్రం ఏర్పాటుకు ఢిల్లీలో జరిగిన శిక్షణకు హాజరయ్యాం. దీనికి సంబంధించి ప్రభుత్వం కోడ్ నెంబరును కేటాయించింది. త్వరలో నాదెండ్లలో జనరిక్ ఔషధ కేంద్రం ఏర్పాటు చేసి తక్కువ ధరలకు ప్రజలకు మందులు అందించనున్నాం. అలాగే రూ.2 కోట్ల వ్యయంతో కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, మీటింగ్ హాలు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి.

–కురుకుంట్ల వెంకటరెడ్డి, చైర్మన్, నాదెండ్ల పీఏసీఎస్

రెండు దఫాలుగా 'ఎక్సెలెన్స్'



ప్రభుత్వ హయాంలో మా సొసైటీకి రెండు దఫాలు ఎక్సెలెన్స్ అవార్డు సాధించుకున్నాం. రైతులకు రుణాల మంజూరు, రికవరీల్లో ముందంజలో ఉన్నాం. జనరిక్ ఔషధ కేంద్రం ఏర్పాటు చేయనున్నాం. డీసీసీబీ, నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో సాతులూరు, గొరిజవోలులో మల్టీపర్పస్ గోడౌన్లు అందుబాటులోకి తెస్తాం.

–టీసీహెచ్ అంజయ్య, సీఈవో, నాదెండ్ల పీఏసీఎస్

అక్రమ మద్యం కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార సోమవారం తెలిపారు. రొంపిచర్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 15 బాటిళ్లు మద్యం కలిగి ఉన్న బి. ఆదినారాయణను అరెస్ట్ చేశామన్నారు. అదే విధంగా నరసరావుపేట పట్టణంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న పూదోట జయన్నను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

శావల్యాపురం ఎస్‌ఐగా సురేష్



శావల్యాపురం: మండల నూతన ఎస్‌ఐగా చల్లా సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిలుకలూరిపేట పట్టణ పోలీసు స్టేషను నుంచి ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. నూతన ఎస్‌ఐ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సజావుగా జరిగేలా మండల ప్రజలు ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం సిబ్బంది పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎస్సై తుళ్ళూరి తిరుపతి రావు బదిలీపై జిల్లా ఎస్‌బీ బ్రాంచ్ కార్యాలయానికి వెళ్లారు.

మునుమాకలో రూ.11.85 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- సచివాలయం, సీసీరోడ్లు ప్రారంభం
- కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



మునుమాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మునుమాక గ్రామంలో రూ.11.85 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మునుమాక గ్రామంలో ఆదివారం రాత్రి సచివాలయ భవనం, సీసీరోడ్లు ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.2.72 కోట్లతో సచివాలయం, సీసీ రోడ్లు, ఆర్‌బీకే, హెల్త్‌కేర్ సెంటర్ నిర్మాణం చేయగా, మరో రూ.95 లక్షలతో జలజీవన్ పథకం కింద ఇంటింటికీ నీటి కుళాయి కార్యక్రమం చేపట్టి పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు. మరో రూ.15 లక్షలతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాలు భవనానికి శంకుస్థాపన చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయం ద్వారానే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గత ప్రభుత్వంలాగా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ గుండాల వెంకటేష్ ఆధ్వర్యంలో పది కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఎదురేగి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచు షేక్ ఆత్రీఫున్, సయ్యద్‌జాన్‌సైదా, సయ్యద్ కరిముల్లా, అల్లాభక్షు, షేక్ చినమస్తాన్, ఎంపీపీ గడ్డం వెంకటరావు, గుండాల వెంకటేష్, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, ముంద్రు హరినారాయణ, పానుగోటి వెంకటరావు, వెంకటేష్, వాసుదేవరెడ్డి, గాదె రామిరెడ్డి, ఎస్.సుజాతాపాల్ పాల్గొన్నారు.

నాదెండ్ల బీసీ సంఘం అధ్యక్షుడిగా సాంబశివరావు



సాంబశివరావుకు నియామకపత్రం అందిస్తున్న అధికార ప్రతినిధి శ్రీను

నాదెండ్ల: మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా నాదెండ్ల గ్రామానికి చెందిన కొనికి సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు నాదెండ్ల గ్రామంలోని హరేరామ దేవాలయం సమీపంలో సోమవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు కాకుమాను రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీను, జిల్లా అధ్యక్షుడు యామా మురళీ, కార్యదర్శి దన్నవరపు వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ రూపేష్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు తెప్పల కాశయ్య పాల్గొన్నారు. అనంతరం సాంబశివరావును అధ్యక్షునిగా ఎన్నుకుని నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వీరాంజి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దార్లు



నాదెండ్ల తహసీల్దార్ వరకుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది



రొంపిచర్ల తహసీల్దార్‌కు అభినందనలు తెలియజేస్తున్న కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు



పి.బ్రహ్మయ్య (వినుకొండ)



బి.దిలీప్‌కుమార్ (ఈపూరు)



లక్ష్మి లావణ్య (శావల్యాపురం)

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ తహసీల్దార్‌గా పి.బ్రహ్మయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా గతంలో పనిచేసిన తహసీల్దార్ కిరణ్‌కుమార్ ప్రకాశం జిల్లాకు బదిలీ కాగా అదే స్థానంలో బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం నుంచి వచ్చారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నాదెండ్ల..

నాదెండ్ల: మండల నూతన తహసీల్దార్‌గా డీవీబీ వరకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీల్లో భాగంగా ఈయన ప్రకాశం జిల్లా బేస్తవారిపేట నుంచి ఇక్కడకు వచ్చారు. వరకుమార్ ఇప్పటి వరకూ ప్రకాశం జిల్లాలో పలుచోట్ల తహసీల్దార్‌గా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో నెల్లూరులో పనిచేశారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయనను రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, ఆర్ఐ రమీజా ఉన్నారు.

ఈపూరు..

ఈపూరు: తహసీల్దార్‌గా బి.దిలీప్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్ ప్రకాశం జిల్లాకు బదిలీ కావడంతో ప్రకాశం జిల్లా రాచర్ల మండలం తహసీల్దార్‌గా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ బదిలీపై ఈపూరుకు వచ్చారు. ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహిస్తామని, ప్రలోభాలకు తలొగ్గకుండా పనిచేస్తామన్నారు.

శావల్యాపురం ...

శావల్యాపురం: మండల నూతన తహసీల్దారుగా నక్కా లక్ష్మి లావణ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతు మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు అర్హత కల్గిన ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్గేలా చర్యలు తీసుకుంటామనీ, ఓట్లు డబుల్ ఎంట్రీలు, చనిపోయిన ఓట్లు తొలగింపులు తదితర వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఫాం–7 తప్పుడు ఆర్జీలపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం నూతన తహసీల్దారును డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పెరిసోముల నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్వోలు ఉప్పటూరి చినమంగయ్య, ఆర్.రాధ, వీఆర్ఏలు తహసీల్దారుకు శుభాకాంక్షలు తెలిపారు.



జ్వాలా నరసింహం (చిలకలూరిపేట)

చిలకలూరిపేట..

చిలకలూరిపేటటౌన్: మండల తహసీల్దార్‌గా ఎం. జ్వాలా నరసింహం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ప్రకాశం జిల్లా కురిచేడు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై చిలకలూరిపేటకు వచ్చారు. ఆయనను డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది అభినందించారు.

రొంపిచర్ల..

రొంపిచర్ల: స్థానిక తహసీల్దార్‌గా ఎస్. ఉషారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రకాశం జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు రొంపిచర్లలో తహసీల్దార్‌గా పనిచేసిన జి. అంకారావు కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపటిన తహసీల్దార్ ఉషారాణిని డీటీ సుబ్బారావు, చంద్రశేఖర్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

చురుగ్గా పేదల ఇంటి రిజిస్ట్రేషన్లు



గణపవరం మూడో సచివాలయంలో ముమ్మరంగా సాగుతున్న రిజిస్ట్రేషన్ పనులు

నాదెండ్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పనులు సచివాలయాల్లో చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 2370 మందికి ఇళ్ల పట్టాలు అందాయి. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోనే నాలుగు సచివాలయాల పరిధిలో 1224 మందికి ఇంటి పట్టాలు దక్కా యి. సోమవారం సాయంత్రం నాటికి మండల పరిధిలో 40 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు రెవిన్యూ సిబ్బంది తెలిపారు. గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులు మూడో సచివాలయంలో ఈనెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ పనులు ప్రారంభించారు. ఆదివారం సైతం రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. వీఆర్వోలు రిజిస్ట్రేషన్ పనులు నిర్వహిస్తున్నారు. గత నెల 27న ప్రారంభమైనప్పటికీ లాగిన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నెల 18 వరకూ అన్ని సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు కావాలని ప్రభుత్వ అధికారులు ఆదేశించటంతో సచివాలయాల వద్ద లబ్ధిదారులు చేరుకుంటున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి రిజిస్ట్రేషన్ పనులు జరుగుతుండటంతో కొన్నిచోట్ల సర్వర్ మందకొడిగా ఉండి ప్రక్రియ నిదానంగా సాగుతోంది. ఉదయం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకూ కూడా సచివాలయ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఇప్పటికే పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరికొన్ని చోట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు కార్యాలయం ముందు టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేసి మంచినీటి సదుపాయం కల్పించారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ పట్టా ఇచ్చిన ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్ చేస్తామని, దశల వారీగా ప్రక్రియ జరుగుతున్నందున లబ్ధిదారులు గందరగోళ పడవద్దని కోరారు. ఈ నెల 18లోగా నూరు శాతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

రొంపిచర్లలో సెంట్రల్ లైటింగ్ ఆరంభం



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలోని చెరువుగట్టు సెంటర్లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా చెరువుగట్టు సెంటర్‌లో ఏర్పాటు చేయదలిచిన వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని కూడా త్వరలో మాజీ మంత్రి నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న పెద్దారెడ్డి కుటుంబాన్ని ఆయన అభినందించారు.